AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

నేతల మధ్య మాటల యుద్ధం

2

రాష్ట్రాన్ని దోచేసిన పార్టీలు: మల్లన్న

2

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

అక్షరటుడే, ఇందూరు: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులున్నారు.

జిల్లా అభివృద్ధి నా బాధ్యత

■ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ■ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి ■ బర్ధిపూర్ సభతో హస్తం శ్రేణుల్లో జోష్

> నిజామాబాద్ జిల్లా తనకు ఎంతో ప్రత్యేకమైందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని బర్ధిపూర్‌లో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తాను ముఖ్యమంత్రి కాక ముందు రైతుల సమస్యపై నిజామాబాద్ జిల్లాకు వచ్చానన్నారు. నాడు ఇక్కడి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతోనే తాను ముఖ్యమంత్రిని అయ్యానని చెప్పారు. తనను ముఖ్యమంత్రి చేయాలని అధినాయకత్వం గుర్తించడానికి నిజామాబాద్ జిల్లానే వేదిక అయ్యిందని గుర్తు చేశారు. నిజామాబాద్‌కు ఔటర్ రింగ్ రోడ్డు, మంచిప్ప ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు.
>
> - అక్షరటుడే, ఇందూరు

నిజామాబాద్ జిల్లాలో అంకాపూర్ చికెన్, పసుపు ఎంతో ప్రముఖమైనవని సీఎం అన్నారు. గతంలో క్వింటాలు పసుపు అమ్మితే తులం బంగారం వచ్చేదన్నారు. నిజామాబాద్ జిల్లా రైతాంగం చైతన్యవంతమైందన్నారు. రైతాంగ పోరాటంలో ఈ జిల్లా ముందుంటుందన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, డి.శ్రీనివాస్ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. 2029లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తన నాయకత్వంలో రెండోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటామని చెప్పారు.

స్మార్ట్ సిటీ ఎందుకు చేయలేకపోయారు

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మోదీ మంత్రం చదువుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. మోదీ దగ్గర పరపతి ఉందని చెప్పుకుంటున్నారని.. ఏడేళ్లలో ఈ జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అంత పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీ చేయలేకపోయారన్నారు. నిజామాబాద్ ఎయిర్ పోర్టు ఎందుకు మంజూరు కాలేదన్నారు. ఏం తెచ్చారని ఓటు అడుగుతున్నారని ప్రశ్నించారు. అర్వింద్‌కు నిజామాబాద్ ప్రజల ఓట్లు కావాలి.. కానీ.. అభివృద్ధి చేయాలనే లేదని విమర్శలు చేశారు. ఈ రాష్ట్రం నుంచి ఎనిమిది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణకు నిధులు తేలేకపోయారని.. ఓటు అడిగే మీ హక్కు లేదన్నారు.

రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బాన్సువాడు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో రూ. 1,045 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. నిజామాబాద్ జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్ తదితర రూ. 600 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత రెండు సంవత్సరాల్లో నిధులు ఇచ్చినా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. అందుకే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయనుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్, పీసీసీ ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, షబ్బీర్‌అలీ, వేణుగోపాల్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ముఖ్యనేతలు మండవ వెంకటేశ్వర్ రావు, టీజీఎండీసీ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మోహన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారం లాంటి అవకాశం

మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేస్తే వృథా అని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అదికారంలో ఉందని.. ఏ పని చేయాలన్నా ఇక్కడే చేసుకోవచ్చన్నారు. గల్లీలో మోరీ చేయాలంటే ఢిల్లీకి వెళ్లాలా అని ప్రశ్రించారు. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీ ఛైర్మన్లు, కార్పొరేటర్లు మన వాళ్లు ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి ఉద్ధండ నేతలు ఉన్నారని.. వారికి డైరెక్ట్‌గా ముఖ్యమంత్రిని నిధులు అడిగే చనువు ఉందన్నారు. బంగారం లాంటి అవకాశాన్ని జారవిడుచుకోవద్దని సూచించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధిలో నిజామాబాద్‌కు ప్రత్యేక స్థానం కల్పిస్తామని.. ఇక్కడి నుంచే అభివృద్ధికి నాంది పలుకుతామన్నారు.

ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కృషి చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లాలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని పీసీసీ ఛీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బర్ధిపూర్ శివారులోని కేశాపూర్ వద్ద నిర్వహించిన సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ ఛీఫ్ మాట్లాడుతూ.. నిజామాబాద్ కార్పొరేషన్‌కు అత్యధిక నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలని సీఎంను కోరారు. జిల్లాలో జిల్లాలో ఎందరో పెద్ద నాయకులు కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించాలని గుర్తు చేశారు. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో వ్యవసాయ కళాశాల ఇచ్చారని తెలిపారు. అలాగే ఎందరో అంతర్జాతీయ క్రీడాకారులు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని తొందరలోనే జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే మూడు జిల్లాలకు మధ్యలో గెస్ట్ హౌస్ నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పడిన నిజామాబాద్ మున్సిపాలిటీ స్మార్ట్ సిటీగా ఎంపిక చేయకుండా కేంద్రం కరీంనగర్‌ను ఎంపిక చేసిందన్నారు. మరి ఈ సమయంలో ఎంపీ అర్వింద్ ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. దీంతోనే ఎంపీ పనితీరు ఏమిటో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి కార్పొరేషన్, మున్సిపాలిటీలను కైవసం చేసుకుందామని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం తప్పదు: ఎమ్మెల్యే

అక్షరటుడే, కామారెడ్డి: ప్రస్తుతం జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠం తప్పదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆయన బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థుల వార్డుల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో కామారెడ్డిలో అవినీతి పెచ్చు మీరిందన్నారు. అందరూ కలిసి మున్సిపాలిటీని అప్పుల్లోకి నెట్టారని, వాళ్లు మాత్రం లాభపడ్డారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో గత రెండేళ్లుగా అవినీతి తగ్గిందని ఎమ్మెల్యే కేవీఆర్ తెలిపారు. భవిష్యత్‌లో అవినీతికి ఆస్కారం లేకుండా నిజాయితీగా పనులు జరగాలి అంటే బీజేపీతోనే సాధ్యమన్నారు.

కాంగ్రెస్ పాలనలో అనేక సంక్షేమ పథకాల అమలు



అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ: రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బర్ధిపూర్ సభలో ఆయన మాట్లాడారు. ఉచిత ఆర్టీసీ బస్సు, ఉచిత విద్యుత్ ఇస్తున్నామని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ మంజూరు చేయలేదని విమర్శించారు. కానీ తాము వచ్చాక కొత్త కార్డులు ఇచ్చామన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో గత ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల రేషన్ కార్డులు ఉంటే.. తాము అధికారంలోకి వచ్చాక మరో 65వేల మంది కార్డులు మంజూరు చేశామన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 16 లక్షల మందికి బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

త్వరలో పామాయిల్ ఫ్యాక్టరీలు తెరుస్తాం: మంత్రి

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: పామాయిల్ సాగులో దేశంలోనే తెలంగాణ ముందుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. పామాయిల్ సాగులో నిజామాబాద్ జిల్లాను ముందుంచుతామని తెలిపారు. ఈ జిల్లాలోనూ త్వరలో పామాయిల్ ఫ్యాక్టరీలు నిర్మిస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో సన్న ధాన్యం పండించిన రైతాంగానికి రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.

పీసీసీ చీఫ్ వ్యాఖ్యలకు ఎంపీ అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్

అక్షరటుడే, ఇందూరు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు వీడియో రిలీజ్ చేశారు. ఆయన ఏమన్నారంటే.. 'పీసీసీ అధ్యక్షులు నా గురించి మాట్లాడుతూ.. ఏడు సంవత్సరాల్లో ఏం చేశారని ప్రశ్నించారని.. చర్చించడానికి గాంధీ చౌక్‌కు రావాలన్నారని.. కానీ మీ ఇంటికే వస్తానని.. చర్చిద్దామని' పేర్కొన్నారు. 'నేడు ముఖ్యమంత్రి నిజామాబాద్‌కు వస్తున్నారు కదా.. తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని' సవాల్ విసిరారు. మహిళలకు రూ. నాలుగువేల పెన్షన్, తులం బంగారం, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రుణమాఫీ, రైతుభరోసా అసంపూర్తిగానే అమలు చేస్తున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు స్కాలర్‌షిప్‌లు ఎంత మందికి మంజూరు చేశారో చెప్పాలన్నారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లు, దివ్యాంగులకు రూ. 6వేల పెన్షన్ ఏమయ్యాయని.. చివరికి దివ్యాంగులను కూడా మోసం చేశారని మండిపడ్డారు. ఎన్‌హెచ్-44పై ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 'కనీసం ముఖ్యమంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీయల్ స్పెల్లింగ్ కూడా తెలియదు. ఆటోడ్రైవర్లను కూడా మోసం చేశారు. 50 ఏళ్లు దాటిన జానపద కళాకారులకు రూ. 3వేల పెన్షన్, నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో బస్తీ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హామీలు ఎక్కడ అమలు చేశారంటూ విరుచుకుపడ్డారు. మూతపడిన 6వేల పాఠశాలలను మెరుగైన సౌకర్యాలతో పున:ప్రారంభిస్తామన్నారు.. ఎక్కడ ప్రారంభించారో చెప్పాలి. నాలుగు త్రిబుల్ ఐటీలు ఏర్పాటు చేస్తామన్నారు.. ఉన్న వాటికి దిక్కులేదు.. తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులు ఎత్తేసి 250 గజాల ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు కదా.. ఇచ్చారా అని ప్రశ్నించారు. మీరు ఇచ్చిన హామీలపై తాను ప్రశ్నిస్తున్నానని.. ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని అర్వింద్ సవాల్ విసిరారు.

అభివృద్ధి చేశానని చెప్పి ఓట్లు అడిగే దమ్ముందా..: షబ్బీర్ అలీ

అక్షరటుడే, కామారెడ్డి : ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గడిచిన రెండేళ్లలో కామారెడ్డికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పి ప్రజలను ఓట్లు అడిగే దమ్ముందా అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఎమ్మెల్యే కేవీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. కామారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా షబ్బీర్ అలీ ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు ఎక్కుపెట్టారు. అభివృద్ధి అంటే పారిపోవడమా అని ప్రస్తుత ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు దమ్ముంటే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు నిలదీస్తుంటే సమాధానం లేక తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. రోడ్లు వేయడం, డ్రెయినేజీలు కట్టడం, నీటి సరఫరా చేయడం, పట్టణ పారిశుధ్యం, స్ట్రీట్ లైట్లు వేయడం అభివృద్ధి కాదని ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని, అసలు అభివృద్ధి అంటే ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచి ప్రజలకు కనపడకుండా పారిపోవడమే వాళ్ల దృష్టిలో అభివృద్ధా.. అని షబ్బీర్‌అలీ నిలదీశారు. తాము ఈ గడ్డపై చేసిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నామని, ఆ ధైర్యంతోనే ప్రజల ముందుకు వచ్చి ఓట్లు అడుగుతున్నామన్నారు. కరప్షన్ గురించి మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్యేకు లేదని, ఆయన గత చరిత్ర అంతా అవినీతిమయమని, దాన్ని నిరూపించే బాధ్యత తమదని పేర్కొన్నారు. తాను సాధ్యమైన పనులకు హామీ ఇస్తానని, వాటిని అమలు చేసి చూపిస్తానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన తర్వాత ఎవరైనా అవినీతికి పాల్పడితే, వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వారిని ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద నిలబెట్టి పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటానని ప్రజల సాక్షిగా మాట ఇస్తున్నట్లు తెలిపారు. కామారెడ్డి పట్టణ సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, హస్తం గుర్తుకు ఓటు వేసి మన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అభివృద్ధిని అడ్డుకున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి: వేముల

అక్షరటుడే, భీమ్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో భీమ్‌గల్ మున్సిపాలిటీ అభివృద్ధిని అడ్డుకుంటోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 2, 4, 8 వార్డుల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో 2023 ఆగస్టులో భీమ్‌గల్ అభివృద్ధి కోసం రూ.10కోట్లు మంజూరు చేశానని, కలెక్టర్ ద్వారా వర్క్ ఆర్డర్లు కూడా వచ్చాయని వేముల గుర్తు చేశారు. 'ముఖ్యంగా 4, 5, 6, 9, 12 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల కోసం రూ.2 కోట్లు కేటాయించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ పనులను రెండేళ్లుగా నిలిపివేసి ప్రజలను ఇబ్బంది పెడుతోంది' అని విమర్శించారు. రూ.40 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి 80 శాతం పనులు పూర్తయినా, మిగిలిన పనులను పూర్తి చేయకుండా ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి 25 నెలలవుతున్నా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఈ లెక్కన ప్రతి మహిళకు ప్రభుత్వం రూ. 62,500 బాకీ పడిందన్నారు. తులం బంగారం, రూ.4000 పెన్షన్, రైతు భరోసా హామీలన్నీ అటకెక్కాయి అని ఎద్దేవా చేశారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థులు లక్ష్మి భగత్, పద్మ దశరథ్, పర్స నవీన్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ప్రజలే నా బలం.. అభివృద్ధే నా లక్ష్యం..

అక్షరటుడే, కామారెడ్డి: వార్డు ప్రజలే తన బలం అని, అభివృద్ధే తన లక్ష్యమని 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి నీలం కళావతి రమేష్ అన్నారు. దేవునిపల్లి గ్రామంలోని తన వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. మేనిఫెస్టోకు సంబంధించిన ప్రతులను పంపిణీ చేశారు. గోడప్రతులను ఇంటింటికి అతికించారు. తన గుర్తును ఒకటికి పదిసార్లు చెబుతూ ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఆత్మాభిమానం ఉన్న వ్యక్తినని, మాట ఇస్తే తప్పే వ్యక్తిని కాదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో పొందు పరిచిన ప్రతి హామీని అమలు చేస్తానని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలకు సంబంధించి ఫలాలను ప్రజలకు నిస్వార్థంగా అందేలా చూస్తానని పేర్కొన్నారు.

గేదె కోసం వెళ్లి అడవిపంది దాడిలో వ్యక్తి మృతి

అక్షర టుడే గాంధారి : గేదె కోసం అడవికి వెళ్లిన వ్యక్తి అడవి పంది దాడిలో మృతి చెందాడు. ఈ ఘటన గాంధారి మండలంలోని హేమ్లానాయక్ తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం హేమ్లా నాయక్ తండాకు చెందిన గుగులోతు సుభాష్(40) అనే వ్యక్తి బుధవారం సాయంత్రం తన గేదె తప్పిపోవడంతో గౌరారం శివారులో గల అడవుల్లో వెతకడానికి కొంతమందితో కలిసి వెళ్లాడు. అక్కడ అడవి పంది దాడి చేయగా సుభాష్ మెడపైన తీవ్ర రక్త గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దీంతో ఆయన మృతి చెందాడు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై ఆంజనేయులు దర్యాప్తు చేపట్టారు. అయితే గుగులోత్ సుభాష్ మృతిపై పోలీసులు పలు కోణాల్లో విచారణ చేస్తున్నారు. సుభాష్ మృతిచెందిన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. ఇందులో సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, స్థానిక ఎస్సై ఆంజనేయులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమచందన పోలీస్ ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆర్మూర్‌లో ప్రచారం జోరుగా సాగుతోంది. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ముఖ్యనేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులకు గాను కాంగ్రెస్ 36, బీజేపీ 34, బీఆర్ఎస్ 35 వార్డుల్లో పోటీలో నిలిచాయి. అయితే ఆర్మూర్ ముఖ్యనేతలైన రాకేష్ రెడ్డి, జీవన్‌రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

– అక్షరటుడే, ఆర్మూర్

బల్దియా పోరులో

నేతల మాటల యుద్ధం

■ విస్తుపోతున్న ఓటర్లు ■ ఆర్మూర్‌లో హోరాహోరీగా మున్సిపల్ ప్రచారం

ఆర్మూర్ పట్టణంలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే పార్టీ రాకేష్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తనదైన చర్యలో విరుచుకుపడుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి బీజేపీ కాంగ్రెస్ నేతల తీరును ఎండగడుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి కూడా తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యాఖ్యలు ఆర్మూర్‌లో చర్చనీయాంశంగా మారాయి.

పారిపోయినోడు ఒకడు.... ఓడిపోయినోడు ఒకడు

ఎన్నికల ప్రచారంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పారిపోయినోడు ఒకడు ఓడిపోయినోడు ఒకడు' అంటూ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డిపై విరుచుకుపడ్డాడు. పోలీసులపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న జీవన్‌రెడ్డిని లోపలేసి తోమాలని వ్యాఖ్యానించారు. వినయ్ రెడ్డి ఓడిపోవడానికి పుట్టాడని, ఆయన జీవితకాలం ఓడిపోవుడేనని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యే అయినప్పటి నుంచి దొంగలు, కబ్జా, కమిషన్, గంజాయి, రౌడీయిజం లేని ఆర్మూర్‌గా మారిందని పేర్కొన్నారు. తాను, తన అనుచరులు అవినీతి బెదిరింపులకు పాల్పడకుండా పాలన సాగిస్తున్నామని ఎక్కడైనా బీజేపీ నాయకులు బెదిరించినట్లు గుర్తిస్తే తనకు చెప్పాలన్నారు.

ఒకడు బ్రోకర్.. ఒకడు జోకర్'

'ఒకడు బ్రోకర్.. మరొకరు జోకర్' అంటూ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డిల పై ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 30శాతం కమిషన్ వసూల్ రెడ్డికి, రాకేష్ రెడ్డికి ముడితేనే పనులు జరుగుతాయని ఆరోపణలు చేశారు. వినయ్ రెడ్డి 'పుష్ప' సినిమాలో మంగళం శీను అయితే రాకేష్ రెడ్డి ఆర్మూర్ పాల్ అన్నారు. ఆర్మూర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది తానేని దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇలా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో ముఖ్య నాయులు ఘాటుగా విమర్శులు చేసుకుంటుండడం సర్వత్రా చర్చనీయంశమైంది.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గద్దల వెంకట కృష్ణ శుక్రవారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలోకి వచ్చారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ రెడ్డి గద్దల వెంకట కృష్ణకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమ్ముల శ్రీనివాస్, లోక సుభాష్, కె.ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అక్షరటుడే, ఆర్మూర్: జీపీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్ అన్నారు. జీపీ భవనంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, స్ట్రీట్ లైట్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి కీలక అంశాలపై చర్చించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామాభివృద్ధే మా ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ పద్మ మోహన్, వార్డు సభ్యులు, ప్రవీణ్, సాయిలు, లక్పతి, రాము, భోజన్న, శిరీష సంజీవ్, రంజిత్, అనుప్రియ, భాస్కర్, మౌనిక, సునీల్, నరేష్, రమ్య, అఖిల్, మహేష్, మల్లేష్, పంచాయతీ కార్యదర్శి రాజలింగం కరాబర్ సంతోష్, లైన్‌మన్ గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, రేషన్ డీలర్లు, హెడ్‌మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

అక్షరటుడే, భీమ్‌గల్: ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంపీడీవో బాలకిషన్ ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రంలో కార్యదర్శులు, ఉపాధి హామీ ఏపీవోలు, టీఏలతో ప్రత్యేక సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో కూలీల సంఖ్య కనీసం 30 మందికి తగ్గకుండా పనులు కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో అన్నారు. వీటికి అవసరమైన ఇసుకను ఆన్‌లైన్ బుకింగ్ ద్వారానే పొందేలా చూడాలన్నారు. ఉపాధి హామీ నిధులకు సంబంధించిన దస్త్రాలను వెంటనే జిల్లా కార్యాలయానికి పంపాలని ఏపీవో, టీఏలను ఆదేశించారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్య ఉంటే తక్షణమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్‌పై ఉపన్యాసం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజకీయ శాస్త్రంపై శుక్రవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ కిష్టయ్య ఉపన్యసించారు. 'భారత రాజ్యాంగం' అనే అంశంపై విద్యార్థులకు క్లాస్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.చంద్రకాంత్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి మోహిన్, అధ్యాపకులు శంకరయ్య, శివ కుమార్, కృష్ణ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

అక్షరటుడే, బాల్కొండ: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలలోని ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు సాలార్ మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుల్ హింద్ మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ఎంఐఎం ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రెటరీ వజీద్ మాట్లాడుతూ విద్యే భవిష్యత్‌కు ప్రధాన ఆయుధం అని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు అతిక్ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ.. మోడల్ పేపర్లు పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం ప్రశాంత్ కుమార్, వి.శ్రీనివాస్, వకీల్, సుందర్, చంద్రశేఖర్ రాజు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో 39వ డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ప్రజల సహకారంతో 39వ డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని.. కార్పొరేటర్‌గా తనను గెలిపించాలని దాంపల్లి జ్యోతి మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు డివిజన్‌లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా కాలనీలో ప్రచారం నిర్వహించారు. 'మన ఇందూరు-మన మేయర్' నినాదంతో బీజేపీ నగరంలో ముందుకు వెళ్తోందన్నారు. డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. బీజేపీ తమకు సేవ చేసుకునే అవకాశం ఇవ్వాలని వారు ప్రజలను కోరారు. భారీ మెజారిటీతో తమను గెలిపిస్తే తప్పనిసరిగా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

మూకుమ్మడిగా అన్ని పార్టీలు రాష్ట్రాన్ని దోచేశాయి: మల్లన్న

అక్షరటుడే, కామారెడ్డి : మూకుమ్మడిగా అన్ని పార్టీలు కలిసి రాష్ట్రాన్ని రూ.కోట్లల్లో దోచేశాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. టీఆర్పీ తరపున మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా శుక్రవారం కామారెడ్డి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో బీడీ కార్మికులకు పింఛన్ల కోసం నిధులు కేటాయిస్తే అందులో భారీగా దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. 201718లో రూ.430 కోట్లు కేటాయిస్తే రూ.45.28 కోట్లు దోచుకున్నారని, 2019-20లో రూ.803 కోట్లు కేటాయిస్తే రూ.84.30 కోట్ల దోపిడీకి పాల్పడ్డారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్ కిట్ల కోసం రూ.44 కోట్లు కేటాయిస్తే రూ.40.20 కోట్లు పంచుకున్నారని, 2018-19 లో రూ.75 కోట్లు కేటాయిస్తే రూ.41.51 కోట్లు మాయం చేశారని ఆరోపించారు. పాఠశాలల్లో ఆడపిల్లలకు ప్రత్యేక బాత్‌రూంలు నిర్మించడం కోసం కేటాయించిన నిధులలో రూ.71 కోట్లను సైతం పక్కదారి పట్టించారని మల్లన్న విమర్శించారు. వికలాంగులకు సంబంధించిన నిధుల్లో రూ.1.25 కోట్లు మెక్కారని.. కల్యాణలక్ష్మి పథకంలో రూ.2 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. మైనారిటీలకు కేటాయించిన నిధులలో సైతం దోపిడీ జరిగిందన్నారు. 2014-15లో మైనార్టీలకు రూ.1,050 కేటాయిస్తే.. అందులో రూ.726.15 కోట్లు దోచుకున్నారని, 2015-16లో రూ.556 కోట్లు, 2017-18లో రూ.370 కోట్లు ఇలా మొత్తం రూ. 2వేల కోట్లు దోచుకున్నారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో టీఆర్పీ రాష్ట్ర నాయకులు హరిశంకర్ గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి ఆకుల హన్మాండ్లు, జిల్లా అధ్యక్షుడు తాహెర్ మహ్మద్, ప్రధాన కార్యదర్శి బొక్కల సంతోషి, కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

పోతంగల్ బస్టాండ్‌లో మూత్రశాలల పునర్నిర్మాణం

అక్షరటుడే, కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మూత్రశాలలను పునర్నిర్మించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మాండ్లు మాట్లాడుతూ.. గతంలో ప్రయాణికులు మూత్రశాలలు శిథిలావస్థకు చేరడంతో అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. వారి ఇబ్బందులను గమనించిన తాము టాయిలెట్లను పునర్నిర్మించామని తెలిపారు. మహారాష్ట్ర కర్ణాటకతో పాటు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, విద్యార్థులు ఈ బస్టాండ్ గుండా ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. వారి సమస్యను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ నిధులతో మూత్రశాలలను తిరిగి నిర్మించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు పంచరెడ్డి అనిల్, సంతు పటేల్, శేఖర్, శ్రీనివాస్, గంధపు సాయిలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మూడో వార్డు అభివృద్ధికి కృషి చేస్తా..

అక్షరటుడే ఆర్మూర్: తనను కార్పొరేటర్‌గా గెలిపిస్తే మూడో వార్డు అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థిని యామాద్రి కవిత భాస్కర్ అన్నారు. ఈ మేరకు వార్డులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు, గణేష్ నగర్, విద్యానగర్ కాలనీలో అభ్యర్థిని యామాద్రి కవిత భాస్కర్ పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షాకాలంలో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వరద నీరు ఇళ్లలోకి చేరకుండా భారీ కల్వర్టుల నిర్వాణకు కృషి చేస్తానన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, మురికి కాల్వలు, డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి కృషి చేస్తామన్నారు. మూడో వార్డు బీజేపీ అభ్యర్థినిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని యామాద్రి కవితా భాస్కర్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట వార్డు బీజేపీ నాయకులు, మహిళలు ఉన్నారు.

అభివృద్ధికి పెద్దపీట వేస్తా..

అక్షరటుడే, ఇందూరు: తనను గెలిపిస్తే అభివృద్ధికి పెద్దపీట వేస్తానని 24వ డివిజన్ అభ్యర్థిని ఇప్పకాయల సుమిత్ర కిషోర్ అన్నారు. ఈ మేరకు డివిజన్‌లోని పలు కాలనీల్లో శుక్రవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఇప్పకాయల సుమిత్ర కిషోర్ అన్నారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజలతో మమేకమవుతూ వారి కష్టాలను తెలుసుకున్నారు. కార్పొరేటర్‌గా గెలిపిస్తే తప్పనిసరిగా డివిజన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి ఆదర్శ డివిజన్‌గా మారుస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సహకారంతో డివిజన్‌లోని అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇప్పటికే డివిజన్‌లో రూ.కోటితో పలు అభివృద్ధి పనులు చేశామని.. తాను కార్పొరేటర్‌గా గెలిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని వివరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు పలు హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

26వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

అక్షరటుడే, ఇందూరు: తనను ఆదరించి కార్పొరేటర్‌గా గెలిపిస్తే 26వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి ఎనుగందుల మురళి అన్నారు. ఆయా కాలనీల్లో శుక్రవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. తాను మాజీ కార్పొరేటర్‌గా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించానని ఎనుగందుల మురళి తెలిపారు. ఈ సందర్భంగా కాలనీల్లో ఇంటింటికి వెళ్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. తనను కార్పొరేటర్‌గా గెలిపిస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇస్తూ ముందుకు కదిలారు. సింహం గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. తాను డివిజన్ ప్రజలకు సుపరిచితుడినేనని ప్రజలు తనను ఆదరించాలని మురళి కోరారు. 26వ డివిజన్‌పై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. సమస్యలన్నింటినీ తెలుసుకున్నానని గెలిచిన అనంతరం వారి పరిష్కారానికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ప్రజలు మద్దతిస్తే కార్పొరేటర్‌గా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజలమధ్యే ఉండి సేవ చేస్తా

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని 35వ డివిజన్‌పై తనకు పూర్తి అవగాహన ఉందని.. ప్రజల మధ్యే ఉండి సేవచేసే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ అభ్యర్థి తాటికొండ నరేశ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం హమాల్‌వాడిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తనను కార్పొరేటర్‌గా గెలిపిస్తే ప్రజల మధ్యే ఉంటానని.. డివిజన్‌కు రావాల్సిన నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల హయాంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని ఆయన వివరించారు. ప్రతి డివిజన్‌కు రూ.కోట్లల్లో నిధులు తీసుకొచ్చి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అదే స్ఫూర్తితో డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదరించి కార్పొరేటర్‌గా గెలిపించండి

అక్షరటుడే, ఇందూరు : తాను ఎప్పటికీ ప్రజల మనిషినేనని.. ఆదరించి కార్పొరేటర్‌గా గెలిపిస్తే ప్రజలకు సేవ చేస్తానని బీజేపీ 19వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నాగోళ్ల లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు కంఠేశ్వర్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. నగరంలో బీజేపీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నాగోళ్ల లక్ష్మీనారాయణ అన్నారు. తనకు డివిజన్‌పై పూర్తి పట్టు ఉందన్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో ఓటర్లను కలిసి బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. తనను కార్పొరేటర్‌గా గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజలకు సేవచేసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆధ్వర్యంలో నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నాగోళ్ల వివరించారు. డివిజన్‌తో పాటు నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. డివిజన్ ప్రజలు తనను ఆదరించాలని.. గెలిపిస్తే ఆదర్శవంతమైన పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

27వ డివిజన్ ప్రజల వెన్నంటే ఉండి అభివృద్ధి చేస్తా..

అక్షరటుడే, ఇందూరు : నగరంలో 27వ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని కల్పె అర్చన చిరంజీవి అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో శుక్రవారం ఆమె విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థంగా అమలయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వాడవాడలా తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి అందేలా చూడడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. 27వ డివిజన్‌లో రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారం దిశగా పని చేస్తానని, డివిజన్ సమగ్రాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

16వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

అక్షరటుడే, ఇందూరు : ప్రజలు ఆశీర్వదించి తనను కార్పొరేటర్ గా గెలిపిస్తే 16వ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని బీఆర్ఎస్ అభ్యర్థిని జింక తార రాజు అన్నారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పలు కాలనీల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. బీఆర్ఎస్ కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజల మధ్య ఉండి సేవ చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా పదేళ్లలో ఎంతో కృషి చేశారన్నారు. డివిజన్లకు రూ.లక్షల్లో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారని వివరించారు. 16వ డివిజన్‌లోని ఆయా కాలనీల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ ప్రజలు గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా

అక్షరటుడే, ఇందూరు : తనను ఆదరించి కార్పొరేటర్‌గా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని 8వ డివిజన్ బీజేపీ అభ్యర్థి మఠం పవన్ అన్నారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం పవన్ మాట్లాడుతూ.. బీజేపీతోనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆధ్వర్యంలో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అలాగే ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. వారి ఆధ్వర్యంలో డివిజన్‌ను అభివృద్ధి బాట పట్టిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ హయాంలో దేశంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పవన్ వివరించారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన, పీఎం ఆవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం ఉజ్వల్ యోజన ఇలా అనేక పథకాలు రైతులు, పేదలకు అందుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా పాలన సాగిస్తోందని.. ఆ స్ఫూర్తితో తాను డివిజన్‌ను సైతం అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల్లో ఒకడిగా ఉంటూ వారి సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని మఠం పవన్ హామీ ఇచ్చారు. కొట్లాడి డివిజన్‌కు నిధులు తీసుకొస్తానని డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, యువ మోర్చా, మహిళా మోర్చా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌గా గెలిపిస్తే 37వ డివిజన్ ప్రజలకు అండగా ఉంటాం

అక్షరటుడే, ఇందూరు: నగరంలో 37వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిపిస్తే డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని బీజేపీ అభ్యర్థిని మల్యాల అర్చన అనిల్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కాలనీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నగరంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి వేగంగా జరుగుతోందన్నారు. ఈ క్రమంలోనే డివిజన్‌లో వారి మద్దతుతో అభివృద్ధి చేసే అవకాశం తనకు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కాలనీల్లో ప్రతిఒక్కరినీ పలకరిస్తూ ముందుకు వెళ్లారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా తనను గెలిపిస్తే డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తార రాజు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క సమస్యను తన సమస్యగా భావిస్తూ పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

24 వార్డు ప్రజలకు అండగా ఉంటా..

అక్షరటుడే, ఆర్మూర్ : తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆర్మూర్ పట్టణంలోని 24వార్డు ప్రజలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి మట్టెల శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఎంఫార్మసీ చదివిన తాను ఉద్యోగాన్ని వదులుకుని ప్రజలకు సేవచేసేందుకు కౌన్సిలర్‌గా పోటీచేస్తున్నానని శ్రావణ్‌కుమార్ తెలిపారు. తనను భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కాలనీల్లో తిరుగుతూ ప్రతిఒక్కరినీ కలుస్తూ ఆయన ఓట్లను అభ్యర్థించారు. ముఖ్యంగా తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలపై ప్రజలు తెలిపిన సమస్యలను గమనించి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అందరికీ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆర్మూర్‌లో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఆయన ముందుకు సాగారు. తనను గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

27వ డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : కార్పొరేటర్‌గా అవకాశమిస్తే ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అండగా ఉంటామని 27వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిని పెంటి కల్యాణి దేవిదాస్ అన్నారు. ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆనంద్‌నగర్ తదితర కాలనీల్లోని ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు తప్పక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడారు. కష్టసుఖాలను తెలుసుకుని ముందుకు సాగారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉన్నందున డివిజన్‌కు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తామని ప్రజలకు పెంటి కల్యాణి దేవిదాస్ హామీ ఇచ్చారు. 27వ డివిజన్‌ను అన్నివిధాలా ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాటుపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఇంటికి సంక్షేమఫలాలు అందేలా చూస్తాం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : తనను డివిజన్ కార్పొరేటర్‌గా గెలిపిస్తే ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని 48వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిని సామల ప్రసన్న సత్యపాల్ అన్నారు. జెండాగల్లీ, పాటిగల్లీ, కోటగల్లీ ప్రాంతాల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేసి గెలిపించాలని సామల ప్రసన్న సత్యపాల్ అన్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో తిరుగుతూ ప్రతి సమస్యను నోట్ చేసుకున్నారు. గెలిపిస్తే తప్పక పరిష్కార మార్గం చూపుతామని హామీ ఇచ్చారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆధ్వర్యంలో నగరంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. వారి సహకారంతో డివిజన్‌కు భారీగా నిధులు తీసుకొచ్చి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ధర్మాన్ని కాపాడే వారికే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా..

అక్షరటుడే, ఇందూరు : తనను ఆశీర్వదించి కార్పొరేటర్‌గా గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని 47వ డివిజన్ బీజేపీ అభ్యర్థి దుద్దోళ్ల గిరిబాబు అన్నారు. ఈ మేరకు అంగడిబజార్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నగరంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలతో మాట్లాడుతూ.. వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. అలాగే ఒక్కసారి అవకాశమివ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. బీజేపీ ఆధ్వర్యంలో డివిజన్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సహకారంతో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు విశేషంగా కృషి చేస్తానని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. 'మన ఇందూరు-మన మేయర్' నినాదంతో ఓట్లు అడుగుతున్నామని.. బీజేపీతోనే నగరానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.